
వివరాలు మెయిన్‌లో

కార్తీక వనభో'జనం' సందడి

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి



# బిసి రిజర్వేషన్లు సామాజిక తెలంగాణ నిర్మాణంలో కీలక అడుగు

### తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

**ప్రజాపక్షం/సూర్యాపేట** : బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన సామాజిక తెలంగాణ నిర్మాణంలో కీలక అడుగని తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఆదివారం సూర్యాపేటలోని తిరుమల గ్రాండ్ కాన్ఫరెన్స్ హాల్లో తెలంగాణ జనసమితి జిల్లా కమిటి ఆధ్వర్యంలో యువజన సమితి నాయకులు నారబోయిన కిరణ్ అధ్యక్షతన నిర్వహించిన సామాజిక తెలంగాణ బిసి రిజర్వేషన్లు ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంపై జరిగిన సద్సులో ప్రధాన వక్తగా పాల్గొని ఆయన మాట్లాడారు. సదస్సు ప్రారంభంలో మహాత్మాజ్యోతిరావుపూలే, బిఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. తెలంగాణ ప్రజలు ఎన్నో త్యాగాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం ఆదిపత్య వర్గాల బదలాయింపుకు కాదన్నారు. ప్రజలందరికి భాగస్వామ్యం కల్పించడం కొరకు సాధించుకున్నామన్నారు. ఆ దిశగా అడుగులు వేయడమే తెలంగాణ ప్రజల యొక్క కర్తవ్యమని స్పష్టం చేశారు. బిజెపి మొదటి నుంచి కులగణనకు వ్యతిరేకమని, రాష్ట్ర ప్రభుత్వం కుల గణన ప్రారంభించడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. అందరూ ఐక్యంగా పోరాడి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు సాధించాలన్నారు. ప్రజలకు కావల్సింది ఉచిత పథకాలు కాదు సమానత్వం, ఆత్మగౌరవం అన్నారు. రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన చట్టాలు, ఆర్డినెన్స్‌లను గవర్నర్లు ఆమోదం తెలపకపోవడం దురదృష్టకరమన్నారు. రిజర్వేషన్లు 50 శాతం దాటొద్దనేది సుప్రీం కోర్టు తీర్పు కాదని, 1931 బిసి సెన్సస్, 1961 సెన్సస్, 1979 మండల కమీషన్ రిపోర్టులను పరిగణలోనికి తీసుకొని అప్పటి పరిస్థితుల్లో కోర్టు ఆ అభిప్రాయం వ్యక్తం చేస్తోందని వివరించారు. రిజర్వేషన్లు సవరించుకోవచ్చని మండల కమీషన్ రిపోర్టులోనే ఉందన్నారు. రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చి న్యాయ సమీక్ష నుండి రక్షణ కల్పించాలన్నారు. ప్రజలు ఎన్నుకున్న శాసనసభ చట్టం చేసి పంపితే దాన్ని తిరస్కరించే అధికారి గవర్నర్లకు లేదన్నారు. గవర్నర్లు కేంద్ర ప్రభుత్వ ఏజెంట్లుగా వ్యవహరిస్తూ ఫెడరల్ వ్యవస్థకు తూట్లు పొడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక అసమానతలను నిర్మూలించడంలో రిజర్వేషన్లు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. తెలంగాణ జన సమితి పార్టీ ఏర్పడిందే సామాజిక ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణం కోసమన్నారు. పదేండ్ల టిఆర్ఎస్ పాలనలో బిసిలకు అన్యాయం జరిగిందని, ఉన్న రిజర్వేషన్లను కూడా తగ్గించారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా సదస్సులు, సెమినార్లు నిర్వహించి ప్రజల్లో చైతన్యం కలిగిస్తామని, డిసెంబర్‌లో హైదరాబాద్‌లో భారీ ర్యాలీ, జనవరిలో ఢిల్లీలో దీక్షలు, ధర్నాలు నిర్వహిస్తామని ప్రకటించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్ మాట్లాడుతూ బిజెపి నాయకులు ఇక్కడ మద్దతు తెలపడం కాదు ఢిల్లీలో ఉన్న పార్టీ వైఖరి ఏమిటో చెప్పే విధంగా ఆ పార్టీ నాయకత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. అనంతరం సదస్సు పలు తీర్మానాలను ఆమోదించింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గట్ల రమాశంకర్, విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు నాగరాజు గౌడ్, బిసి జెఏసి కన్వీనర్ చల్లమల్ల నరసింహ, లీగల్‌సెల్ జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్ నాయక్, విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షులు బొమ్మగాని వినయ్‌గౌడ్ పాల్గొన్నారు.



# రాష్ట్ర కళ సాధన కోసం యాదవ బిడ్డలు కృషి


### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, క్యామా మల్లేష్
### రాష్ట్రాభివృద్ధికి అందరూ ముందుకు రావాలి

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** రాష్ట్రా అభివృద్ధికి అందరూ ముందుకు రావాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, బిఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇన్చార్జి క్యామ మల్లేష్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో శ్రీకృష్ణ యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు పుట్టా వీరేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన యాదవ సదర్ సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర కళ సాధన కోసం యాదవ జాతి బిడ్డలు ఎంతో కృషి చేసారని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, క్యామా మల్లేష్ అన్నారు. ప్రతి సంవత్సరం అందరూ కలిసి ఈ సదరు సమ్మేళనం కార్యక్రమం అందరూ కలిసినిర్వహించడం గొప్ప విషయం అన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాలను ముందు తరాలకు తెలియజేయాలన్నారు. ముందుగా భువనగిరిలోని సాయి బాబా గుడి నుండి జూనియర్ కళాశాల మైదానం వరకు దున్నపోతులను ఊరేగిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఈ సమ్మేళన కార్యక్రమానికి దున్నపోతుల విన్యాసాలను వీక్షించడానికి పట్టణ ప్రజలతో పాటు వివిధ ప్రాంతాల నుండి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇన్చార్జి క్యామ మల్లేష్, తెలంగాణ గొట్ అండ్ షిప్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్, తోట స్వామి యాదవ్, జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్, నక్కల చిరంజీవి యాదవ్, బెల్లి శేఖర్ యాదవ్, శ్రీకృష్ణ యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుండెబోయిన సురేష్ యాదవ్, మేకల బాల నరసింహయాదవ్, మల్లయ్య, సిరబోయిన వెంకటేష్ యాదవ్, అవిశెట్టి రమేష్ యాదవ్, రేకల రమేష్ యాదవ్, రాశల నవీన్ యాదవ్, పర్వతం రంజిత్ యాదవ్, బాద్మా అశోక్ యాదవ్, శ్రీరామ్ శరత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# కుక్కల సమస్యలపై పాల్వంచ హరికిషన్ కార్టూన్

**ప్రజాపక్షం/ రామన్నపేట:** బడులు, బస్టాండ్ వద్ద కుక్కల వద్ద తీవ్రంగా ఉన్న కుక్కల సమస్యకు పరిష్కారం చూపుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సందర్భంగా మరో సమస్య(కోతులు)ను కూడా ఎత్తి చూపుతూ రామన్నపేట మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త, కవి, ఉపాధ్యాయుడు, కార్టూనిస్టు పాల్వంచ హరికిషన్ వేసిన కార్టూన్ ఆలోచింపచేసేదిగా ఉంది. ముఖ్యమైన ప్రాంతాలైన బడులు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌లు, ఆట స్థలాలు తదితర జనావాసాల్లో కుక్కలను నిబంధనల ప్రకారం కట్టడి చేయాలని సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాలకు ఆర్డర్ వేయడం మంచి నిర్ణయమని హరికిషన్ అన్నారు. అదేవిధంగా తెలంగాణాలోని అన్ని ప్రాంతాల్లో కుక్కల సమస్యతోపాటు కోతుల సమస్య కూడా తీవ్రంగా ఉందని ఆ సమస్యకు కూడా నిబంధనల ప్రకా రం పరిష్కారం చూ పాలని ఈ వ్యంగ్య చిత్రం ద్వారా కోరుతున్నానని, కోర్టులు, ప్రభుత్వాలు తగిన నిర్ణయం తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షనలో కూడా సముచితమైన అంశంగా చూడాలని ఆయన కోరారు.




# బుద్ధవనం సందర్శించిన విదేశీ బౌద్ధ భిక్షువులు

**ప్రజాపక్షం/నందికొండ:** అంతర్జాతీయ పర్యాటక కేంద్రం బుద్ధవనాన్ని థాయిలాండ్ బౌద్ధ భిక్షువులు సందర్శించారు. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాలోని సిద్ధార్థ బుద్ధ విహార నుండి బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య సూచన మేరకు నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం సందర్శించారు.గగన్ మాలిక్ ఫౌండేషన్,గుల్బర్గా బౌద్ధ విహార సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి దమ్మయాత్ర కోసం ఈబృందం బుద్ధవనం సందర్శించారు. వీరికి బుద్దవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దమ్మ చారి శాసన,ఎస్టేట్ ఆఫీసర్ రవి చంద్ర, బుద్ధవనంఆర్ట్స్ ప్రమోషన్ మేనేజర్ శ్యాంసుందర్ రావులు బుద్ధవనం విశేషాలను వివరించారు. వీరు ముందుగా బుద్ధవనం సందర్శనలో భాగంగా బుద్ధ చరిత వనంలోని బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించి బుద్ధ వందనం సమర్పించారు.అనంతరం బుద్ధ చరితవనం,జాతక వనం,ధ్యానవనం,స్థూప వనం, మహాస్తుపాలను సందర్శించి బుద్ధ వనంలోని శిల్పాల ఏర్పాట్లపై ప్రశంసించారు.ప్రశాంత వాతావరణంలో అలనాటి బౌద్ధ వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించి వారికి ప్రేరణ కలిగించడం ప్రస్తుత సమాజానికి ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు.నాగార్జునసాగర్‌లోని ప్రశాంత వాతావరణంలో బుద్ధవనాన్ని ఏర్పాటు చేయడం ప్రపంచ బౌద్ధ బిక్షవులకు ఒక ఆరాధన కేంద్రంగా విలసిల్లుతున్నదని అన్నారు. బుద్దావనం అంతర్ భాగంలోని ధ్యాన మందిరంలో బుద్ధం,సంఘం,బుద్ధం శర ణం అనే బుద్ధుని ప్రాథమిక దమ్మ ప్రబోధాన్ని తెలియజేశారు. బుద్ధ ధర్మం గురించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుల్బర్గా నుండి వచ్చిన థాయిలాండ్, కంభోడియా,యుఎస్ఏ, భారతదేశ బౌద్ధ బిక్షులు,ఉపాసకులు పాల్గొన్నారు. థాయిలాండ్ ఉపాసిక లిథ, బుద్ధ విహార గుల్బర్గా నుండి రతన జ్యోతో, నాగార్జునసాగర్ డ్యాం భద్రత అధికారులు శ్రీనివాసరావు,రఘు ,పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ పాల్గొన్నారు.





## ప్రయోగాలతోనే విద్యార్థులకు సులువైన బోధన

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రయోగాల ద్వారానే విద్యార్థులకు సులువైన బోధన అందుతుందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారం పవిత్ర అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జడ్పి బాలుర పాఠశాలలో సైన్స్ అకాడమీ బృందం సభ్యులు జీవశాస్త్ర ఉపాధ్యాయులకు 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు గల కొన్ని రకాల ప్రయోగాలు, కృత్యాలు చేయించి అవగాహన కల్పించారు. జిల్లా సైన్స్ అధికారి, తెలంగాణ బయాలజికల్ సైన్స్ ఫోరం అధ్యక్షుడు ఎల్ దేవరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆర్థికసాయం



**ప్రజాపక్షం/డిండి;** డిండి మండలం తవక్లాపూర్ గ్రామంలో ఒక నెల రోజుల కాల వ్యవధిలో ఐదుగురు చనిపోవడం జరిగింది. చనిపోయిన బొడ్డు నారయ్య, బూసరాజు వెంకటయ్య, వంకేశ్వరం దేవయ్య, కాలూరి రాములమ్మ, కమురు బేగం కుటుంబాలను ఆదివారం తవక్లాపూర్ బిఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచ్ పొన్నగంటి అలివేలు కృష్ణయ్య పరామర్శించి వారి కుటుంబాలకు ఒక్కొక్కరి కుటుంబానికి రూ. 3వేల చొప్పున ఐదు కుటుంబాలకు రూ. 15వేలు ఆర్థిక సాయంగా కృష్ణయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో వంకేశ్వరం బ్రహ్మయ్య, గోరటి జైపాల్, శ్రీరాములు, పాలేశ్వర్, వెంకటేష్, ముత్యాలు, జక్కరయ్య, రమేష్, వెంకటయ్య, జంగయ్య, చోటేమియా పాల్గొన్నారు.

## చీరల పంపిణీ

**ప్రజాపక్షం/డిండి;** డిండి గ్రామ పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ మేకల సాయమ్మ కాశన్న దంపతుల మొదటి కుమారుడు మేకల శివకుమార్ వివాహం చందనతో ఈనెల 16న ఆదివారం డిండి పట్టణంలోని విఎఎస్ ఫంక్షన్ హాల్‌లో జరగనుంది. ఈ సందర్భంగా మేకల సాయమ్మ కాశన్న దంపతులు ఆదివారం డిండి గ్రామ పంచాయతీకి చెందిన మహిళా కార్మికులను పసుపు, కుంకుమతో సత్కరించి చీరలను పంపిణి చేశారు. సాయమ్మ కాశన్న దంపతులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ మహిళా కార్మికులకు చీరలను అందజేయడం సంతోషాన్ని కలగజేసిందని, గ్రామాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచే కార్మికులను మా కుమారుని వివాహం సందర్భంగా సత్కరించడం గొప్ప అనుభూతిని ఇచ్చిందని ఈ సందర్భంగా అన్నారు.



# రైతాంగానికి బ్రిడ్జి సౌకర్యం కల్పించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** జాతీయ రహదారి 65 రాయినిగూడెం కేతినేని చెరువు అలుగు వల్ల రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే జాతీయ రహదారి నిర్మాణ కాంట్రాక్ట్ గ్రూప్ అయిన ఆదాని యాజమాన్యం వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో కేతినేని చెరువు అలుగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అకాల వర్షాలు వచ్చిన సందర్భంగా కేతినేని చెరువు అలుగు ఉప్పొంగి రాయినిగూడెంలోని సుమారు 300 ఎకరాల వరిపంట తీవ్రంగా దెబ్బతిన్నదన్నారు. ఆదాని గ్రూప్‌కు చెందిన కాంట్రాక్టర్లు వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మట్టిపెల్లి సైదులు, గట్టుపల్లి సత్తిరెడ్డి, తంగెళ్ళ శేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తిరుమల్ రెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** జిల్లా కేంద్రంలోని శ్రీసరస్వతి విద్యా నిలయంలో 2007/08 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంను ఆదివారం ఆ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. 17 ఏళ్ల తరువాత కలుసుకున్న నాటి విద్యార్థులంతా అప్యాయంగా ఒకరినొకరు పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాటి తమ గురువులను ఘనంగా సన్మానించారు. నాటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యతోటే అభివృద్ధి సాధ్యమని అన్నారు. అనంతరం విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ తమ పాఠశాల జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహమూర్తి, యానాల వెంకట్ రెడ్డి, లక్ష్మి కాంతరెడ్డి, మురళీకృష్ణ, ఎల్లారెడ్డి, సోమయ్య, లచ్చిరెడ్డి, శేఖర్ రెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామికి పూజలు, అన్నప్రసాద వితరణ



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల కేంద్రానికి చెందిన ఊరే నరేష్ నాగలక్ష్మీ దంపతులు వారి కుమారుడు జీవన్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం చౌరస్తాలోని అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్పస్వామికి భజన, కీర్తనలతో అభిషేకం చేశారు. అయ్యప్పస్వామి దీక్ష తీసుకున్న అయ్యప్ప స్వాములకు మారం జైపాల్‌రెడ్డి ఇందిర దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. అనంతరం ఆ పుణ్య దంపతులను గురుస్వామి చిట్టెడి ప్రభాకర్‌రెడ్డి అయ్యప్పస్వాములతో కలిసి ఘనంగా సన్మానించి, ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో కందుల వెంకట్‌రెడ్డి స్వామి, గోవర్ధన్‌రెడ్డిస్వామి, పురోహితులు దేరం జయప్రకాష్ శర్మ, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు ఊరే జనార్ధన్ ధనమ్మ, కుంభం యాదగిరిగౌడ్ స్వామి, ప్రసాద్ స్వామి, గుమ్మడవెల్లి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా ఆశ్రమంలో అవగాహన

**ప్రజాపక్షం/దేవరకొండ;** ఆదివారం న్యాయసేవ జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని దేవరకొండ న్యాయస్థానంలో మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కే. అనిత ఆధ్వర్యంలో న్యాయస్థానం నుండి ర్యాలీగా పట్టణంలోని మహాలక్ష్మీ వృద్ధాశ్రమానికి వెళ్ళారు. వృద్ధులకు సంబందించి వారి హక్కులు విధి విధానాల గురించి, సీనియర్ సిటిజన్ యాక్ట్ 2007 సీనియర్ సివిల్ జడ్జి న్యాయమూర్తి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ అనిత వివరించారు. ఈకార్యక్రమంలో సీనియర్ న్యాయవాది గాజుల ఆంజనేయులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఉమామహేశ్వర్, న్యాయవాదులు సురేష్, షౌకత్‌అలి, రాములు, జగదీశ్వర్, శ్రీను, అశోక్, రియాజుద్దీన్, శ్రీకాంత్, సాయి, శంకర్, ఎస్ఐ నారాయణరెడ్డి, పాల్గొన్నారు.





## సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** 1969 ఉద్యమకారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు రామరాజు అన్నారు. ఆదివారం పట్టణంలోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బొమ్మిడి లక్ష్మి నారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన రాష్ట్ర కమిటి సమావేశంలో ఆయన మాట్లాడారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకారులను మరిచిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సమస్యలను పరిష్కరించడంలేదన్నారు. విశ్వేశ్వరరావు, సీతారాం రెడ్డి, కృష్ణమూర్తి, ముత్తినేని వెంకట్, చెలినమ్మ, బంధు రుద్రమ్మ, చిత్రం భద్రమ్మ, కిషన్ నాయక్, దయానంద్ పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోకొండూర్ మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన చొప్పరి బుచ్చమ్మ W/O పెంటయ్య అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన సందర్భంగా, గౌరవ ప్రభుత్వ విప్ & ఆలేరు నియోజకవర్గ శాసనసభ్యులు బీర్ల అయిలయ్య సహకారంతో ముఖ్యమంత్రుల సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) నుండి రూ.37,500 చెక్కును లబ్ధిదారైన చొప్పరి బుచ్చమ్మకి గ్రామ శాఖ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు నూనెముంతల సంతోష్, సీనియర్ నాయకులు చాడ శశిధర్ రెడ్డి, బొడిగె బిక్షపతి, ఓర్సు యాదగిరి, బచ్చె రాములు, బాలరాజు, పంతుల రవీందర్, ఏకు సంజీవ రెడ్డి, గ్రామశాఖ ఉపాధ్యక్షులు రాజబోయిన రంజిత్, పాల్గొన్నారు.

## కమ్యూనిస్టులతోనే సమస్యలు పరిష్కారం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కేవలం కమ్యూనిస్టు ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఉట్లపల్లి గ్రామంలో సీపీఎం మాజీ మండల కమిటీ సభ్యుడు బొంగరాల వెంకన్న ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన స్థూపాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. వెంకన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని అన్నారు. సమస్యల పరిష్కారానికై సీపీఎం చేసే పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, చౌగాని సీతారాములు, నాగ్ హుస్సేన్, కన్నెగంటి రామకృష్ణ, చౌగాని వెంకన్న, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థినికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన ఎల్లయ్యమార్తమ్మ దంపతుల కుమార్తె సబిత నీట్ పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించి సిద్ధిపేట ఆర్‌వీఎం మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించారు. కాగా వారి కుటుంబం కడు బీదరికంతో ఉండడంతో సబితను మెడికల్ కళాశాలలో చేర్పించడానికి ఆర్థిక స్థోమత సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సభ్యులు ఆదివారం సబిత ఎంబీబీఎస్ కళాశాలలో చేరడానికి కావాల్సిన రూ.40వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు వీరశేఖర్, వీరశేఖర్, మచ్చా వెంకటేశ్వర్లు, షేక్ ఆరీఫ్, ఒగ్గు వెంకటేశ్వర్లు, వీరాంజనేయులు, ఓర్సు శ్రీనివాస్, రాగ్యానాయక్, చిలుక విద్యాసాగర్, ఎలిమినేటి అంజిరాజు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ వర్కర్స్ కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/మోతె :** గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షులుగా నవిలె నాగరాజు, ఉపాధ్యక్షులుగా వట్టికూటి అవిలయ్య, స్కైలాబ్, ప్రధాన కార్యదర్శిగా గజ్జి లింగయ్య, సలహాదారులుగా జలగం తిరుపతయ్య, తుమ్మకొమ్మ అక్కులు, ఆవుల వీరయ్య, పారిశుద్ధ కార్మికులు గురజాల గురవయ్య, సైదులు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.





## దుప్పట్ల పంపిణీ

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిరు పేద కార్మికులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివారం మండలకేంద్రం లోని లక్ష్మీపురం ప్రాంతంలో పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను పునస్కరించుకుని చిట్యాలకు చెందిన సత్య సాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో 80 మంది నిరు పేద కార్మికులకు చలి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని దుప్పట్లు, పులిహోర,లడ్డు ప్రసాదాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం లో సత్య సాయి సంస్థ సభ్యులు ఝాన్సీ,నాగలక్ష్మి, జ్యోతి, జయ స్పందన,జనమ్మ,నాగమణి,అంజయ్య,అనిల్ కుమార్,మాజీ ఎంపీటీసీ పాశం శ్రీనివాస్ రెడ్డి,రామిరెడ్డి,శంకర్,వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/చండూరుః** ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేద ప్రజలకు ఒకవరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ చండూరు మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం అన్నారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలలో తొమ్మిది మందికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం లబ్ధిదారుకు చండూరులో అందజేశారు. ఈకార్యక్రమంలో పడసనబోయిన యాదయ్య, బొమ్మరగోని యాదయ్య, సోము లింగస్వామి, నీల కంఠం సాయిలు, పడసనబోయిన నగేష్ ,సాయం లౌకి,శివ ,వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్‌ను కలిసిన యాదగిరి

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్యని కాంగ్రెస్ పార్టీ నాయకులు కానుకుంట్ల యాదగిరి మర్యాదపూర్వకంగా కలసి అరుణాచలం శివ స్వామి వారి ప్రసాదం అందజేశారు.



# అయ్యప్ప స్వామి మహా పడిపూజ



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఆర్టిఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి స్వగృహంలో ఆదివారం బ్రహ్మశ్రీ డాక్టర్ పిఎం మనోజ్ తాంత్రిక ఆధ్వర్యంలో పెండెం శ్రీనివాస్ గురు స్వామి, రామారావు గురుస్వాముల పర్యవేక్షణలో శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతి హోమం, సమస్త దేవతా ప్రార్ధన, గణపతి పూజ, అష్టోత్తర శతనామావళి, దూపము, నైవేద్యము, కర్పూర హారతి, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి పూజ, అష్టోత్తర శతనామావళి, దూపము, నైవేద్యము, కర్పూర హారతి, శ్రీ అయ్యప్ప స్వామిపూజ, శ్రీ అయ్యప్ప స్వామి అథాంగ పూజ, అష్టోత్తర శతనామావళి, దూపము, దీపము, నైవేద్యము, హారతి, శ్రీ అయ్యప్ప స్వామి శరణు ఘోష, అయ్యప్ప స్వామికి 18 రకాల కలశాలతో అభిషేకము, 18 రకాల పాలు, పెరుగు, నెయ్యి తో అభిషేకాలు.అనంతరం పుష్పాభిషేకం, స్వామివారికి నైవేద్యాన్ని సమర్పించి పడి పూజను నిర్వహించి పడిని వెలిగించారు.తుర్కపల్లి ప్రాంతమంతా శ్రీ అయ్యప్ప నామస్మరణతో మారు మోగింది.అనంతరం మంత్రపుష్పం, ఆత్మప్రదక్షణ, భూతనాథ సోత్ర రత్నావళి, మంగళ హారతి, క్షమాపణ మంత్రాన్ని తో పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జయజయహే తెలంగాణా రచయిత, ప్రముఖ కవి అందెశ్రీ, గురుస్వాములు పత్తిపాటి హనుమంతరావు, పత్తిపాటి ఆనంద్, రాయగిరి శ్రీనివాస్, రాచర్ల నాగరాజు, చాడ కరుణాకర్ రెడ్డి , దొమ్మాట భాస్కర్, పూడూరు శేఖర్, గురునాథ్, కనక రాజు, బోరెడ్డి లక్ష్మీనరసింహారెడ్డి ,ధార నవీన్, రాజేష్, మున్సిపల్ రాజు, నరసింహ పాల్గొన్నారు.

# ప్రత్యేక పారిశుధ్ధ్య కార్యక్రమాలు చేపట్టాలి



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో పది రోజుల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సిపిఎం జిల్లా కమిటి సభ్యులు మద్దెపురం రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని శివాలయం నుండి గిరికత్తుల అబ్బయ్య ఇంటి వరకు సిసి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీటిని స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైపు లైన్ లీకేజీని అరికట్టి రోడ్లపై మురుగునీరు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శి మునావర్‌కు చరవాణి ద్వారా విజ్ఞప్తి చేశారు. గ్రామంలోని స్పెషల్ ఆఫీసర్ పరమేశ్వర్, సెక్రటరీ మునావర్‌లు విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం వలన గ్రామంలో సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిందని తక్షణమే గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో గ్రామ ప్రజలు గిరికత్తుల రమేష్, శోభన్, యాదలక్ష్మి పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ అల్లామా ఇక్బాల్ జయంతి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణం ప్రకాశం బజార్లో ఉన్న ఇక్బాల్ మినార్‌ను అభివృద్ధి చేయాలని ఫలాహ్ ఇ మిల్లత్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఏఏ ఖాన్ కోరారు.ప్రపంచం ఉర్దూ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రకాశం బజార్ లోని ఇక్బాల్ మినార్ వద్ద డాక్టర్ అల్లామా ఇక్బాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు.మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గుమ్ముల మోహన్ రెడ్డి ఇక్బాల్ మినార్ వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఏఏ ఖాన్ మాట్లాడుతూ ఇక్బాల్ మినార్‌ను సెంటర్ లో ఏర్పాటు చేయాడం వల ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తొలుగుతాయని చెప్పారు.దీనిని దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ యంత్రాంగం తగిన నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు.అనంతరం ఉర్దూ మీడియం హై స్కూల్లో చదువుతున్న 15 మంది విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలోమాజీ మున్సిపల్ కౌన్సిలర్ మహమ్మద్ ఆమెర్,మహమ్మద్ మసియుద్దీన్, బాబా జియావుద్దీన్, సయ్యద్ జాఫర్, షఫీ నవాజ్ ఖాన్,మునీరుద్దీన్,మహమ్మద్ మహమూద్,సమద్,ముజీబుద్దిన్ తాహెర్,గౌస్ మొహియుద్దీన్,హాషం, ఎం. ఏ జమీల్, మహమ్మద్ నసీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి పట్టణంలో అర్బన్ కాలనీ 15వ వార్డ్‌కు చెందిన పద్మశాలి కుటుంబంనికి చెందిన కోమాకుల భాను ప్రసాద్ అనారోగ్యంతో చాలా రోజుల నుండి భాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు పోలిశెట్టి ఫౌండేషన్ చైర్మన్ మాజీ కౌన్సిలర్ పోలిశెట్టి అనిల్ కుమార్ మృత దేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన వారి కుటుంబంనీ ప్రగాఢ సంతాపం తెలిపారు. పోలిశెట్టి ఫౌండేషన్ ద్వారా రూ.5000 ఆర్థిక సాహయంను వారి భార్య కోమాకుల లక్ష్మి కి అందజేశారు. భవిష్యత్ వారి కుటుంబం అండగా ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శివ, శ్రవణ్, సాయి, నర్సింహా వాసుధేవు తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన చలమల్ల శ్రీనివాస్ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామ బీజేపీ నాయకులు ఆదివారం శ్రీనివాస్ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి రూ.43వేలను అందించి ఓదార్చారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఏళ్ల సంజీవరెడ్డి, మునిపంపుల మాజీ ఎంపీటీసీ, పీఏసీఎస్ డైరెక్టర్ కన్నెకంటి వెంకటేశ్వరాచారి, జెల్ల లక్ష్మీ నారాయణ, రాపోలు విశ్వనాధం, బడుగు యాదగిరి, గుంటోజు కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా యువజన ఆదివారం


**ప్రజాపక్షం/నందికొండ:** యువత దైవచింతను కలిగి ఉండాలని యువజన నాయకులు అడుగుల చినదాసు అన్నారు.ఆదివారం యూత్ సండే సందర్భంగా హిల్ కాలనీలోని త్రిత్వ లూథరన్ ఆలయం లో వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన దైవ సందేశం అందిస్తూ యువత చెడు మార్గాలకు పోకుండా దైవచింతను కలిగి ఉండి సమాజాభివృద్ధికి తోడ్పడాలన్నారు.యేసు చూపిన మార్గంలో యువత నడిచి భావితరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రారంభ ప్రార్థనను కుమారి సుజాత చేయగా కార్యక్రమాన్ని కే. శామ్యూల్ చార్లెస్ నడిపించారు. ఆరాధనను డాక్టర్ సిహెచ్ విహారిక చేశారు. ఈ కార్యక్రమం లో సంఘ కాపరి రమేష్ బాబు,సంఘ అడ్మిన్ కోటేశ్వరావు, సంఘ ట్రెజరర్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.18,116 అన్నప్రసాద వితరణకు



**ప్రజాపక్షం/కోదాడ:** పట్టణ పరిధి హుజూర్‌నగర్ రోడ్డులోని శ్రీఅయ్యప్పస్వామి దేవాలయంలో మాలధారుల అన్నప్రసాద వితరణకు పట్టణానికి చెందిన చీదేళ్ళ కృష్ణమూర్తి, ధర్మపత్ని వెంకటసుబ్బమ్మలు రూ॥18,116లు అందించారు. వీరిని ఆలయ కమీటి వారు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దాత కుమారుడు వెంకటసాంబశివరావు, ధర్మపత్నిఉమామహేశ్వరీ, వెంకట సురేష్, ధర్మపత్ని లక్ష్మి చంద్రిక, వెంకటసతీష్, ధర్మపత్ని అన్నపూర్ణ, ఆలయ కమీటి సభ్యులు, గురుస్వాములు, మాలధారులు పాల్గొన్నారు.

## తప్పిపోయిన వారందరిని అప్పగింత



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదాద్రి శ్రీ లక్ష్మి నరసింహస్వామి పుణ్యక్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న కారణంగా, ఈవో మౌఖిక ఆదేశాల మేరకు యాదగిరిగుట్ట సిఎస్ఓ కే.శేషగిరిరావు తప్పిపోయిన వారి కోసం ప్రత్యేక టీమ్స్ ఏర్పాటు చేశారు. తప్పిపోయిన వారి వివరాలు సేకరించి వారందరిని కొండ పైన కంట్రోల్ రూమ్ దగ్గరికి చేర్చి సీసీటీవీ/మైక్ ద్వారా అనౌన్స్మెంట్ చెపించి తప్పిపోయిన వారందరినీ సురక్షితంగా వారి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తిరిగి అందుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

## సిఎం గుట్టకువచ్చి ఏడాదైనా ఒక్క రూపాయీ కేటాయించ లేదు



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదాద్రి శ్రీలక్ష్మి నరసింహస్వామివారి ఆలయానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చి ఏడాది గడిచిన రూపాయి కేటాయింపు జరగలేదని టీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణ సెక్రెటరీ జనరల్ పాపట్ల నరహరి ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది రేవంత్ రెడ్డి తన పుట్టిన రోజు సందర్భంగా స్వామివారి దర్శనానికి వచ్చి అధికారులతో సమీక్షలు జరిపి, పెండింగ్ పనులపై నివేదిక కోరాడు. రూ.100 కోట్లు నిధులు కేటాయిస్తానని ప్రకటించి, ఇప్పటికీ గుట్ట అభివృద్ధికి ఒక్కరూపాయి కేటాయించడం పై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆదివారం పట్టణంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట తొలిసీఎం కేసీఆర్ రూ.1300 కోట్ల ప్రభుత్వ ఖాజానాతో స్వామివారి ఆలయాన్ని ప్రపంచమే అబ్బురపడే విధంగా పునర్నిర్మిస్తే, రేవంత్ రెడ్డి మాత్రం ఆలయాన్ని కనీసం పట్టించుకోవడం లేదన్నారు. పట్టణ సెక్రెటరీ జనరల్ పాపట్ల నరహరి, పట్టణ ప్రధాన కార్యదర్శులు పేరబోయిన సత్యనారాయణ, ఆరే శ్రీధర్ పాల్గొన్నారు.

# కొనసాగుతున్న మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ఏజెన్సీ కార్మికులు బిల్లులు, వేతనాలు, కోడిగుడ్డు బిల్లులు కొరకు 8వ తేదీ నుండి వారం రోజులు పాటు రోజు వారి నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఏఐటియుసి ఉపాధ్యక్షులు వేము రాంబాబు తెలిపారు. గత డిసెంబర్ నుంచి నేటి వరకు కోడుగుడ్డు బిల్లు, బకాయిలు, వేతన బకాయిలు, మెనూచార్జీల బకాయిలు, గత కొన్ని నెలలుగా ఏజెన్సీ కార్మికులకు అందక అనేక అవస్థలు పడుతున్నట్లు కుటుంబాలు అప్పులు భారాలతో ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. వేతన బకాయిలు పడే వరకు అధికారుల వద్ద మధ్యాహ్న భోజనం వంట తయారు చేస్తున్న పాఠశాలల్లో నిరసన కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఏజెన్సీల బకాయిలు పేరుకుపోయి ఏజెన్సీల అప్పుల భారం కుటుంబాల అప్పుల భారం తో ఇబ్బందులు పడుతూ మోయలేని భారాలు మోస్తున్నామని వారు తెలుపుతున్నారు. ఎక్కువగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలైన కల్లూరు బాలికోన్నత, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పేరువంచ, చిన్న కోరుకొండి, బత్తులపల్లి, వెన్నవల్లి, మర్లపాడు తదితర ఉన్నత పాఠశాలలతో పాటు ప్రాథమిక పాఠశాలల్లో కొన్ని నెలలుగా బకాయిల భారంతో ఏజెన్సీ కార్మికులు మోయలేకపోతున్నామని పేర్కొంటున్నారు. కనుక ఖమ్మం కలెక్టర్, కల్లూరు సబ్ కలెక్టర్, తహసిల్దార్, మండల విద్యాశాఖ అధికారి, తదితర కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు.

# సేంద్రియ ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సేంద్రియ ఉత్పత్తుల వాడకం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని కాంగ్రెస్ యువ నాయకులు తుమ్మల యుగంధర్ తెలిపారు. ఆదివారం ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో గల సేంద్రియ రైతు బజార్‌ను కాంగ్రెస్ యువ నాయకులు, ప్రముఖ సేంద్రియ వ్యవసాయ మార్గదర్శి తుమ్మల యుగంధర్ సందర్శించారు. ఈ సందర్భంగా సేంద్రియ పంటలు, సాంప్రదాయ విత్తనాలు, దేశీ వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. వారి అనుభవాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా యుగంధర్ మాట్లాడుతూ సేంద్రియ పద్దతిలో సాగు చేసిన పంటలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎటువంటి రసాయనాలను వాడకుండా సేంద్రియ పద్దతిలో సాగు చేసి పండించిన పంటలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. రైతులు సహజ ఎరువులు, జీవామృతం, గోమూత్ర ఆధారిత వాడకం, విత్తన సంరక్షణపై అవగాహన కల్పించారు. విత్తన బ్యాంకులు, రైతుల మధ్య విత్తన మార్పిడి కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పరుచూరి దంత వైద్యశాల వార్షికోత్సవం





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పరుచూరి దంత వైద్యశాల 30వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఖమ్మం నగరంలోని పరుచూరి దంత వైద్యశాలలో జరిగిన కార్యక్రమంలో 30వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. వైద్యులు పరుచూరి వెంకటేశ్వరరావును శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం దంత వైద్యశాలను ఖమ్మం నగరంలో ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు దంత సమస్యలతో బాధపడే రెండు లక్షల మందికి పైగా రోగులకు చికిత్సలు అందించినట్లు ఆయన తెలిపారు. దంత వైద్య విభాగంలో మొత్తం ఏడు కేటగిరిలు ఉన్నాయని ఆ ఏడు కేటగిరిలు కూడా ఖమ్మం నగరంలో పరుచూరి వైద్యశాలలో అత్యాధునీక వసతులతో అందుబాటులో ఉన్నాయన్నారు. వైద్య విద్య పూర్తి కాగానే తాను పుట్టి పెరిగిన ఖమ్మం జిల్లా ప్రజలకు సేవలందించేందుకు 1996 నవంబర్ తొమ్మిదిన మా ఇంటి పేరుతో పరుచూరి దంత వైద్యశాలను స్థాపించినట్లు ఆయన తెలిపారు. 30 సంవత్సరాలుగా ఆదరిస్తున్న ఖమ్మం జిల్లా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని 38 కొనుగోలు కేంద్రాలలో ఖరీఫ్ సీజన్లో ఐకెపి, డీసీఎంఎస్, పిఎసిఎస్, మెప్మా, వారి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్ళు ముమ్మురంగా కొనసాగుతున్నట్లు తహశీల్దార్ పులి సాంబశివుడు, వ్యవసాయ శాఖ అధికారిని రూప, సివిల్ సప్లై డిటినరేష్ లు తెలుపుతున్నారు. మండలంలో సన్నాలు, లావులు ధాన్యం రైతులు తీసుకొని వచ్చి మద్దతు ధరను పొందాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. మండల పరిధిలోని పుల్లయ్య బంజర, చెన్నూరు, ఎర్రబోయినపల్లి, జిడిపి పల్లి ,పెద్ద కోరుకొండి, పోచవరం, లింగాల, కల్లూరు తదితర కొనుగోలు కేంద్రాలలో ధాన్యం ముమ్మరంగా కొనుగోలులు కొనసాగుతున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర ఏ గ్రేడ్ 23 89, బి గ్రేడ్ 23 69 ధరను పొందాలని అధికారులు రైతులను కోరుతున్నారు. దళారులను ఆశ్రయించకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి తరలించి మద్దతు ధర పొంది లాభాలను పొందాలని రైతులను అధికారులు కోరుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు వారి పేర్కొన్నారు. ప్రతిరోజు సంబంధిత శాఖ అధికారులు పర్యవేక్షణ చేస్తున్నట్లు వివరించారు.

# అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్, జెసిబి సీజ్




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ప్రజాపక్షం తెలుగు దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన బరితెగించిన మట్టి మాఫియా కథనంపై రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు స్పందించారు. సరైన డాక్యుమెంట్లు లేకుండా పాత కొమ్మేపల్లి రోడ్డు నుండి అక్రమంగా మట్టి తరలిస్తున్న అశోక్ లేలాండ్ వాహనంతో పాటు మట్టిని తోలుస్తున్న జెసిబి వాహనాన్ని సైతం రెవిన్యూ శాఖా వారి సమాచారంతో మైనింగ్ ఏడి రమేష్ నేతృత్వంలోని బృందం అడ్డుకుని స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించింది. ఈ సందర్భంగా మైనింగ్ ఏడి, సత్తుపల్లి తహశీల్దార్లు మాట్లాడుతూ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడితే చట్టపరంగా శిక్షిస్తామని, వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# జోరుగా కాంగ్రెస్ నేతల ప్రచారం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలు, మంత్రి క్యాంప్‌కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి సూచనలతో ఖమ్మంరూరల్ కాంగ్రెస్ నేతలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి ఆధ్వర్యంలో అక్కడి బోరంబడలోని షాపులు, ఇంటింటికి, పాదచారులను కలిసి హస్తం గుర్తుకే ఓటు వేసి అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జ్ ఎమ్మెల్యే మందుల సామేలు కుమారుడు మందుల సూర్య కుమార్, మండల నాయకులు మద్ది వీరారెడ్డి, తోట వీరభద్రం, తేజావత్ పంతుల్‌నాయక్, ముత్యం కృష్ణారావు, గునిగంటి సురేష్, ఆరెంపుల రామయ్య, మొండెం వెంకటేష్, సింగిరెడ్డి, బోసిరెడ్డి, మద్ది వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌సిఎం చర్చిలో బైబిల్ పరీక్షలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని కల్లూరు ఆర్సీఎం చర్చి, పెద్ద కోరుకొండి లో ఆర్‌సిఎం చర్చిలో ఆదివారం బైబిల్ పరీక్షలు జరిగాయి. నాలుగు విభాగాలుగా నిర్వహించిన ఈ పరీక్షలలో ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకువిద్యార్థులు మరియు విద్యావంతులైన మహిళలు ఈ పరీక్షలలో పాల్గొన్నారు. పరీక్షలలో ప్రతిభ కనబడిన వారికి నగదు, ప్రోత్సాహ బహుమతులు ఖమ్మం బిషప్ ద్వారా అందించనున్నట్లు మత గురువులు వినయ్, అంతోని లు తెలిపారు. ఫలితాలు డిసెంబర్ 25వ తేదీ కల్లా ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలలో వంద మంది విద్యార్థిని విద్యార్థులు, విద్యావంతులు, చిన్న కోరుకొండి ,పెద్ద కోరుకొండి, చెన్నూరు, ఎర్రబోయినపల్లి మహిళలు పాల్గొనగా పర్యవేక్షకులుగా మత గురువులు, కన్య స్త్రీలు, ఉపదేశకులు పాల్గొన్నారు

# పది విద్యార్థులకు స్పెషల్ తరగతులు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం రెబ్బవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఆదివారం ఇతర ప్రభుత్వ సెలవు దినములు, ప్రతిరోజు సాయంత్రం రోజుల్లో రోజుకు ఒక సబ్జెక్టు చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు రాకముందే ఈ పాఠశాలలో ఉపాధ్యాయుల సహకారంతో ప్రధానోపాధ్యాయులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు ఈ రకంగా విద్యార్థుల కొరకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ పాఠశాలలో గ్రామస్థులు, పూర్వ విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు అల్పాహారానికి గాను కొంత సొమ్మును విరాళంగా అందజేసి సాయంత్రం అల్పాహారాన్ని అందిస్తూ ఆకలి లేకుండా విద్యార్థులు చదువుఓవడానికి సహకారం అందిస్తున్నందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాలు, ఏఎఇసం చైర్మన్ తులశమ్మ ధన్యవాదాలు తెలిపారు.

# కిష్ణాపురం తండలో సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని కిష్ణాపురం తండాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, డ్రైనేజీలు నిర్మించాలని సిపిఐ (ఎం)మండల కమిటీ సభ్యులు కావూరి వెంకటేశ్వరరావు కోరారు. పార్టీ మండల కమిటీ బృందం ఆదివారం కిష్ణాపురం వెనక తండా సమస్యలపై సర్వే నిర్వహించింది. తండాలో మంచినీటి పైపులు పగిలి మూడు నెలలు అవుతున్న గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నీళ్లు వదిలే సందర్భంలో పగిలిన పైపుల నుండి నీళ్లు బయటకు వచ్చి అవి ఇళ్లలోకి, రోడ్లపై వెళ్లడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు కువారపు లక్ష్మణరావు, హసావత్ కృష్ణ, బర్మా వత్ అరుణ్ కుమార్, అజ్మీర విజయకుమార్, లకావత్ మారేష్, ధరావత్ నాగమణి, అజ్మీర రాము, లావిడియా తదితరులు పాల్గొన్నారు.